# నమస్తే తెలంగాణ

## ములుగు జయశంకర్ భూపాలపల్లి

5 | వరంగల్, గురువారం 14 నవంబర్ 2024 | MULUGU JAYASHANKAR BHUPALPALLY





ఉప్పల్‌లో ధాన్యం ఆరబోస్తున్న రైతు బైకన మల్లయ్య (ఇన్‌సెట్‌లో) సెల్‌కు వచ్చిన మెసేజ్

# బోనస్ లేదు.. అంతా బోగస్

**రాష్ట్ర ప్రభుత్వం సన్న రకం ధాన్యానికి బోనస్ చెల్లిస్తామని చెప్పిందంతా బోగస్ అని తేలిపోయింది. దీంతో సన్నాలు సాగు చేసిన రైతుల ఆశలు అడియాశలు అయ్యాయి. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే అమ్మితే మద్దతు ధర రూ. 2320తో పాటు రూ. 500 బోనస్ ఇస్తామని కాంగ్రెస్ సర్కారు ప్రకటించింది. దీంతో రైతులు పండించిన సన్నరకం ధాన్యాన్ని బయట అమ్మకుండా కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించారు. క్వింటాలు ధాన్యానికి 5కిలోల తరుగుపోతున్నా బోనస్ వస్తుందనే ఆశతో కొనుగోలు కేంద్రాల్లో అమ్మితే తీరా మద్దతు ధర రూ. 2320 మాత్రమే చెల్లిస్తోంది. మద్దతు ధర డబ్బులే ఖాతాలో పడినట్లు మెసేజ్ రావడంతో రైతులు అయోమయంలో పడ్డారు. అధికారులను అడిగితే సమాధానం దాట వేస్తున్నారని వాపోతున్నారు.** - కమలాపూర్, నవంబర్ 13

### సన్నాలకు రూ. 500 లేకుండానే చెల్లింపులు

- మద్దతు ధర డబ్బులే ఖాతాలో పడినట్లు మెసేజ్
- అయోమయంలో రైతులు
- సమాధానం దాటవేస్తున్న అధికారులు

కమలాపూర్, నవంబర్ 13: హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలంలో ప్రాథమిక వ్యవ సాయ పరపతి సంఘం ఆధ్వర్యంలో 16, సెర్ప్(ఐకేపీ) ఆధ్వర్యంలో ఐదు కొనుగోలు కేంద్రా లను ప్రారంభించారు. రైస్‌మిల్లర్లు సన్నరకం ధాన్యం 40 కిలోల బస్తాకు 2కిలోల తరుగు తీస్తూ పదిహేను రోజులుగా కొనుగోలు చేస్తున్నారు. అయినప్పటికీ రైతులు సన్నరకం ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించారు. అమ్మిన రైతులకు రెండు రోజుల నుంచి రూ. 2320 మద్దతు ధరతోనే బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమవుతున్నాయి. బోనస్ డబ్బులు లేకుండా చెల్లింపులు చేస్తుండడంతో రైతులు ఆందోళనతో కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, వ్యవసాయాధికా రులు, సివిల్ సప్లయ్ అధికారులకు ఫోన్లు చేసి అడుగుతున్నారు. అధికారులు సరైన సమాధా నం చెప్పకుండా దాటవేస్తున్నారు. సివిల్ సప్లయ్ అధికారులు కొందరు రైతులకు రూ. 2320 మద్దతు ధర కేంద్ర ప్రభుత్వం చెల్లిస్తున్నది. రాష్ట్ర ప్రభుత్వం వారం రోజుల తర్వాత బోనస్ చెల్లిస్తుందని పొంతన లేని సమాధానాలు చెబుతున్నట్లు రైతులు తెలిపారు. దీంతో రుణమాఫీ, రైతుభరోసా ఇస్తామని చెప్పి కాంగ్రెస్ ప్రభుత్వం ఇవ్వకపోయే బోనస్ డబ్బులు కూడా వస్తయో? రావో? అని అయోమయంతో తెలిసిన అధికారులు, ఇతర మండలాల రైతులకు ఫోన్లు చేసి తెలుసుకుంటున్నారు. ఎక్కడ రైతులకు బోనస్ డబ్బులు పడలేదని చెప్తుతుండడంతో ఆందోళన చెందుతున్నారు. బోనస్ డబ్బులు వస్తయా? లేదా అనవసరంగా మాటలు నమ్మి అమ్ముకున్నాం. దళారులకు అమ్మిన క్వింటాలుకు రూ. 2700 వచ్చునని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఐకేపీ కొనుగోలు కేంద్రాల్లో ఇప్పటి వరకు 4018 క్వింటాళ్లు, పీఏసీఎస్‌లో 9542 క్వింటాళ్ల సన్నరకం ధాన్యం కొనుగోలు చేశారు.

### బోనస్ ఇస్తదంటే అమ్మినం

ప్రభుత్వం సన్నరకం వడ్లకు బోనస్ ఇస్తదంటే నమ్మి ఐకేపీ కొనుగోలు కేంద్రంలో అమ్మినం. మూడెకరాల్లో వడ్లు 39 క్వింటాళ్ల 20 కిలోలు వచ్చాయి. దొడ్డురకం మద్దతు ధర రూ. 2320తో రూ. 90,944 ఖాతాలో జమ అయినట్లు సెల్‌ఫోన్‌కు మెసేజ్ వచ్చింది. ఖాతాలో జమ అయిన డబ్బులను లెక్కిస్తే బోనస్ లేకుండా చెల్లించిట్లు తెలిసింది. బోనస్ కలిపి చెల్లిస్తే రూ. లక్షా పదివేలు రావాలి. బోనస్ డబ్బులు ఎప్పుడు వేస్తరని ఐకేపీ అధికారులను అడిగితే సమాధానం చెప్పడంలేదు.

– ఎర్రబెల్లి అనిల్ రావు, రైతు ఉప్పల్, కమలాపూర్



# దవాఖానల్లో ఎలుకల నివారణ చర్యలు



సీకేఎం హాస్పిటల్ ఆవరణలో ఎలుకల నివారణకు మందు చల్లుతున్న శానిటేషన్ సిబ్బంది

వరంగల్‌చౌరస్తా, నవంబర్ 13: వరంగల్ సీకేఎం హాస్పిటల్‌లో అధికారులు ఎలుకల నివారణ చర్యలు చేపట్టారు. ఇటీవల హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ దవాఖానను సందర్శించి పారిశుధ్య చర్యలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో కలెక్టర్, ఉన్నతాధికారులు వైద్యాధికారులను వివరణ కోరారు. అలాగే, హనుమకొండలోని ప్రభుత్వ ప్రసూతి హాస్పిటల్‌లో ఎలుకల బాధలు ఎక్కువైన విషయమై సామాజిక మాధ్యమాలు, పలు పత్రికల్లో రావడంతో అధికారులు స్పందించారు. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా బుధవారం హాస్పిటల్ ఆవరణలోని బొరియల్లో ఎలుకల నివారణ మందు చల్లారు.

**వరంగల్ నగరంలో రౌడీరాజ్యం నడుస్తోంది. కొందరు రౌడీషీటర్లు పొలిటికల్ నేతల సపోర్ట్‌తో మళ్లీ పెట్రేగుతున్నారు. భూకబ్జాలు, సెటిల్‌మెంట్ల దందాకు పాల్పడుతున్నారు. వినకుంటే బెదిరిస్తూ భౌతిక దాడులు చేస్తున్నారు. మరికొందరు డబ్బుల కోసం కుటుంబ పంచాయితీలు, ఆర్థిక లావాదేవీల్లో కలుగజేసుకుంటున్నారు. ఇంకొందరు పీడీఎస్ బియ్యం, గుట్కా, గంజాయి రవాణాకు పాల్పడుతూ అమాయక యువకులకు డబ్బులు, మద్యం ఆశ జూపి నేరస్తులుగా మారడానికి ఉసిగొల్పుతున్నారు. నగరంలో పోలీస్ నిఘా కొరవడడంతో తమ నేర ప్రవృత్తిని బయటపెడుతున్నారు. రౌడీషీటర్ల ఆగడాలతో నగరవాసులు ఆందోళన చెందుతున్నారు.** - సుబేదారి, నవంబర్13



# నగరంలో రౌడీరాజ్యం

## పొలిటికల్ సపోర్ట్‌తో మళ్లీ పెట్రేగుతున్న రౌడీషీటర్లు

- భూకబ్జాలు, సెటిల్‌మెంట్ల దందా
- వినకుంటే బెదిరింపులు, భౌతిక దాడులు
- పీడీఎస్ బియ్యం, గుట్కా, గంజాయి రవాణా
- యువకులకు ఆశచూపి నేరస్తులుగా మారడానికి ఉసిగొల్పుతున్నవైనం
- కొరవడిన పోలీస్ నిఘా
- ఆందోళనలో నగరవాసులు

ఇంతకు ముందు వరంగల్ పోలీస్ కమిషనరేట్ టాస్క్‌ఫోర్స్ విభాగం అధికారులు రౌడీషీటర్లపై నిఘా పెట్టి వారికి ట్రీట్‌మెంట్ ఇవ్వడంతో వెనక్కి తగ్గారు. ఈ మధ్య రౌడీషీటర్లపై పోలీసుల నిఘా లేకపోవడంతో సివిల్ వివాదాల్లో తలదూర్చడం, చిన్న విషయాలకే గొడవలు పడి భౌతిక దాడులకు పాల్పడడం వంటివి వెలుగులోకి వస్తున్నాయి. కమిషనరేట్ పరిధిలో మొత్తం 699 మంది రౌడీషీటర్లు ఉన్నారు. వీరిలో మిల్స్‌కాలనీ, మట్టెవాడ, ఇంతేజార్‌గంజ్, హనుమకొండ, కేయూసీ, సుబేదారి, మడికొండ, హసన్‌పర్తి పోలీస్ స్టేషన్లలో రౌడీషీట్ నమోదైన 234 మందిలో 70 మంది మోస్ట్ వాంటెడ్‌గా ఉన్నారు. వీరంతా భూ తగాదాల్లో తలదూర్చుతున్నారు. కుటుంబపరమైన పంచాయితీలు, ఆర్థిక లావాదేవీల సెటిల్‌మెంట్స్ చేస్తూ రౌడీయిజం ప్రదర్శిస్తున్నారు. మోస్ట్ వాంటెడ్ రౌడీషీటర్లు, పొలిటికల్ సపోర్ట్ ఉన్న రౌడీలు తమ దందాలు వెలుగులోకి రాకుండా జాగ్రత్తగా పోకిరీలను ముందు పెట్టి డే పేమెంట్, మద్యం పార్టీలతో ల్యాండ్ సెటిల్‌మెంట్లు, ఆర్థిక లావాదేవీల పంచాయితీలు చేస్తున్నారు. నగరంలో హోటల్స్, రహస్య ప్రదేశాలను అడ్డాగా చేసుకొని ఇటువంటి సెటిల్‌మెంట్స్ చేస్తూ ఆర్థికంగా బలపడుతున్నారు.

**రౌడీషీటర్ల కదలికలపై కొరవడిన నిఘా**

కొంతకాలంగా రౌడీషీటర్ల కదలికలపై పోలీసుల నిఘా లేకుండా పోయింది. రెండు రోజుల క్రితం హనుమకొండ పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇవ్వగా, వరంగల్‌లో ఆ దాఖలాలు లేవు. కొద్ది నెలల నుంచి వరంగల్ పోలీస్ కమిషనరేట్ ప్రత్యేక విభాగం టాస్క్‌ఫోర్స్ రౌడీషీటర్ల కదలికలపై దృష్టి పెట్టడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇంతకు ముందు ఈ విభాగంలో పనిచేసిన ఓ ఐపీఎస్ అధికారి తమదైన స్టైల్‌లో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ చేసి పేరు తెచ్చుకున్నారు. భూ కబ్జాలకు పాల్పడితే ఎంతటివారినైనా అరెస్ట్ చేసి అణచివేశారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేకపోవడంతో రౌడీషీటర్లు మళ్లీ రెచ్చిపోయి దందాలకు పాల్పడుతూ, అమాయకులపై భౌతిక దాడులకు పాల్పడుతున్నారు. రాత్రివేళ కొందరు రౌడీషీటర్లు స్థానిక యువకులను చేరదీసి గ్యాంగ్‌లు ఏర్పాటు చేసుకొని దందాలకు పాల్పడుతున్నారు. మిడ్‌నైట్ దాకా మందు పార్టీలు చేసుకోవడం, ఆ సమయాల్లో రోడ్లపై వచ్చిపోయే వాహనదారులను కొట్టి, డబ్బులు లాక్కోవడం వంటి సంఘటనలు అక్కడక్కడా జరుగుతున్నాయి.

### వరంగల్ నగరంలో ఇటీవల జరిగిన రౌడీషీటర్ల దాడుల వివరాలు..

- ఓ మాజీ రౌడీషీటర్ అధికార పార్టీ నేత అండతో రెచ్చిపోయి కొందరు పోలీసు అధికారులతో భూదందాలు, సెటిల్‌మెంట్లు చేయడం, అడ్డువచ్చిన వారిని పోలీసులతో కొట్టించిన ఘటనలు వెలుగులోకి వచ్చాయి.
- తాజాగా హనుమకొండలో ఇద్దరు రౌడీషీటర్లు పొలిటికల్ సపోర్ట్‌తో భూ తగాదాలు, ఫ్యామిలీ గొడవలు, ఆర్థిక పరమైన లావాదేవీల సెటిల్‌మెంట్లు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. వీరికి కొందరు పోలీసులు కూడా సపోర్ట్ చేస్తున్నట్లు తెలుస్తున్నది. ఇటీవల కాజీపేటలో ఓ వాహనదారుడిని ఓ రౌడీగ్యాంగ్ కొట్టడంతో, మరో రౌడీషీటర్ బెదిరించి సెటిల్‌మెంట్ చేసినట్లు తెలిసింది.
- హనుమకొండ అలంకార్ జంక్షన్ వద్ద ఇద్దరు రౌడీషీటర్లు ఓ యువకుడిని కొట్టారు. బాధితుడి ఫిర్యాదు మేరకు వారిని హనుమకొండ పోలీసులు అరెస్ట్ చేశారు.
- బీఆర్ నగర్‌లో చిన్న విషయానికి ఓ రౌడీషీటర్ ఆటోడ్రైవర్‌ను కర్రతో తీవ్రంగా కొట్టడంతో బాధితుడు మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా అరెస్ట్ చేశారు. కేయూసీ పోలీస్ స్టేషన్ పరిధిలో నాలుగు రోజుల క్రితం ఓ మాజీ రౌడీషీటర్ స్విగ్గీ డెలివరీ బాయ్‌ని తీవ్రంగా కొట్టడంతో కోమాలోకి వెళ్లాడు.

# చైతన్య దీప్తులు కాళోజీ సోదరులు

- సమాజ శ్రేయస్సుకు వారు అంకితం
- రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ నాళేశ్వరం శంకరం
- కాళోజీ, రామేశ్వర్‌రావు పురస్కారాల ప్రదానం



మాట్లాడుతున్న ప్రముఖ కవి డాక్టర్ నాళేశ్వరం శంకరం

పోచమ్మమైదాన్, నవంబర్ 13: జాతీయోద్యమం, తెలంగాణ ఉద్యమ సమయంలో ప్రజల్లో చైతన్యాన్ని నింపిన గొప్ప కవులు కాళోజీ సోదరులని ప్రముఖ కవి, తెలంగాణ రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ నాళేశ్వరం శంకరం అన్నారు. హనుమకొండలోని వాగ్దేవి డిగ్రీ, పీజీ కళాశాల సెమినార్ హాల్‌లో కేంద్ర సాహిత్య అవార్డు గ్రహీత డాక్టర్ అపంశయ్య నవీన్ అధ్యక్షతన బుధవారం రాత్రి కాళోజీ సోదరుల యాది సభ, స్మారక పురస్కారాల ప్రదాన కార్యక్రమం నిర్వహించారు. ముందుగా కాళోజీ సోదరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాళేశ్వరం శంకరం మాట్లాడుతూ తెలుగు సాహితీ ప్రపంచంలో రామలక్ష్మణుల మాదిరిగా కాళోజీ సోదరులు సమాజ శ్రేయస్సుకు అంకితమై పనిచేశారని అన్నారు. వారు జీవించినంతకాలం రాజ్యం నిరంకుశ పోకడలను నిరసిస్తూ, ప్రజల పక్షాన ఉంటూ సమాజ హితవు కోరారని అన్నారు. కులాలు, మతాలకు, ప్రాంతాలకతీతంగా అణచివేతకు గురవుతున్న పీడిత ప్రజల తరపున నిస్వార్థంగా పనిచేయడమే కాకుండా నిద్రాణమైన తెలంగాణ సమాజాన్ని తమ కవిత్వంతో మేల్కొలిపిన గొప్ప కవి సోదరులని కొనియాడారు. రాష్ట్రం, దేశంలో ఏర్పడ్డ నిర్బంధ కాలాన్ని ఎదిరించిన మహానుభావులని పేర్కొన్నారు. ఈ సమయంలో ప్రజల్లో చైతన్యాన్ని, ధైర్యాన్ని నింపిన గొప్ప కవి, ఉద్యమకారుడు కాళోజీ నారాయణరావు అని తెలిపారు. గత 30 ఏళ్ల నుంచి కాళోజీ ఫౌండేషన్ ద్వారా చేపడుతున్న కార్యక్రమాలను కార్యదర్శి వీఆర్ విద్యార్థి వివరించారు. అలాగే ఓరుగల్లు ఉర్దూ కవులకు షాద్ రామేశ్వర్‌రావు గురువులాంటి వారన్నారు. ఆయన కవిత్వం దక్కన్ ప్రాంతంలో ఉర్దూ కవులకు ఆదర్శనీయమైనదని పేర్కొన్నారు. అనంతరం కాళోజీ ఫౌండేషన్ కోశాధికారి పందిళ్ల అశోక్ కుమార్ పురస్కార గ్రహీతలకు సన్మాన కార్యక్రమం నిర్వహించగా, రామేశ్వర్‌రావు షాద్ స్మారక పురస్కారాన్ని పాత్రికేయుడు వహీద్ గుల్షన్‌కు అందజేశారు. అలాగే ప్రజాకవి కాళోజీ నారాయణరావు స్మాకర పురస్కారాన్ని సుప్రసిద్ధ దారు శిల్పి మర్రి గోపాల్ రెడ్డికి అందించారు. వీరికి రూ.10,116 నగదుతో పాటు మెమెంటో అందజేసి, శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ ఎన్‌వీఎన్ చారి, ఫౌండేషన్ కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ ఆగపాటి రాజ్‌కుమార్, పలువురు సాహితీవేత్తలు, పరిశోధక విద్యార్థులు, కవులు, రచయితలు, కాళోజీ అభిమానులు పాల్గొన్నారు.

# విద్యార్థినులతో ఉపాధ్యాయుడి అసభ్య ప్రవర్తన

## సస్పెండ్ చేయాలని తల్లిదండ్రుల డిమాండ్

నర్మెట, నవంబర్ 13: విద్యార్థినులతో అసభ్యకరంగా ప్రవర్తిస్తున్న ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేశారు. జనగామ జిల్లా నర్మెట మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో రసాయన శాస్త్రం బోధిస్తున్న ఉపాధ్యాయుడు కర్ణాకర్ కొంతకాలంగా అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడని పిల్లలు తల్లిదండ్రులకు తెలపడంతో విషయం వెలుగులోకి వచ్చింది. దీంతో తల్లిదండ్రులు పాఠశాలకు వచ్చి ఆ ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేయాలని ఆందోళన చేశారు. విషయం తెలుసుకున్న మండల విద్యాశాఖ అధికారి ఐలయ్య, ఎస్సై నాగేశ్ పాఠశాలకు వచ్చి విద్యార్థినుల తల్లిదండ్రులు, గ్రామస్తులతో మాట్లాడారు. ఓ మహిళా ఉపాధ్యాయురాలిని విద్యార్థినులతో మాట్లాడించి జరిగిన విషయాన్ని తెలుసుకున్నారు. ఈ విషయమై ప్రిన్సిపాల్ పుష్పకుమారి, ఎంఈవో ఐలయ్య మాట్లాడుతూ తల్లిదండ్రుల ఫిర్యాదుతో జిల్లా విద్యా శాఖ అధికారితో పాటు విద్యాశాఖ డైరెక్టర్, ఉన్నతాధికారులకు సమాచారం అందించామన్నారు. వారి ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.



పాఠశాల వద్ద ఆందోళన చేస్తున్న విద్యార్థినుల తల్లిదండ్రులు

### కేయూ ఎంవో పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

హనుమకొండ చౌరస్తా, నవంబర్ 13 : కాకతీయ విశ్వవిద్యాలయ ఆరోగ్యకేంద్రంలో ఒప్పంద ప్రాతిపదికన పూర్తిస్థాయి మెడికల్ ఆఫీసర్‌గా (1 పురుష, 1 మహిళ) పని చేయడానికి ఆసక్తి ఉన్న వారు ఈ నెల 20లోగా దరఖాస్తు చేసుకోవాలని రిజిస్ట్రార్ మల్లారెడ్డి ఒక ప్రకటన విడుదల చేశారు. అభ్యర్థులు కనీసం ఎంబీబీఎస్ పూర్తి చేసి ఉండాలన్నారు. ఎంపికైన వారికి వేతనం రూ.60 వేలు ఉంటుందని, పూర్తి చేసిన దరఖాస్తులు 20న సాయంత్రం 4గంటలలోపు విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ కార్యాలయంలో సమర్పించాలన్నారు.






### మార్కెట్‌కు మూడు రోజులు సెలవు

కాశీబుగ్గ, నవంబర్ 13: ఎనుమాముల వ్యవసాయ మార్కెట్‌కు మూడు రోజులు సెలవు ఇస్తున్నట్లు కార్యదర్శి పోలెపాక నిర్మల తెలిపారు. 15న కార్తీక పౌర్ణమి, గురునానక్ జయంతి, 16న వారాంతపు యార్డు బంద్, 17న ఆదివారం సెలవు అని పేర్కొన్నారు. సోమవారం నుంచి మార్కెట్‌లో క్రయవిక్రయాలు యథావిధిగా కొనసాగుతాయని తెలిపారు. రైతులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు. మార్కెట్‌కు నాణ్యమైన వ్యవసాయ ఉత్పత్తులు తీసుకొచ్చి మద్దతు ధర పొందాలని కోరారు.

# పలు రైళ్ల రద్దు, దారి మళ్లింపు

కాజీపేట, నవంబర్ 13 : కాజీపేట- బల్లార్షా సెక్షన్‌లో నడిచే పలు రైళ్లను బుధవారం రైల్వే అధికారులు రద్దు, దారి మళ్లింపు, రీ షెడ్యూల్ చేసి నడిపించారు. పెద్దపల్లి-రాఘువాపూర్ రైల్వే స్టేషన్ల మధ్యలోని కన్నాల వద్ద గూడ్స్ రైలు మంగళవారం రాత్రి పట్టాలు తప్పి, ఆరు వ్యాగన్లు చెల్లాచెదురుగా పడిపోయి రైల్వే ట్రాక్ ధ్వంసమైంది.

**రద్దు చేసిన రైళ్లు..**

హైదరాబాద్- సిర్‌పూర్ కాగజ్ నగర్ (17011) ఇంటర్ సిటీ రైలు , సికింద్రాబాద్- సిర్‌పూర్ కాగజ్ నగర్, సికింద్రాబాద్ (12757/12758) కాగజ్‌నగర్ ఎక్స్‌ప్రెస్, కాజీపేట- సిర్‌పూర్ టౌన్ (17003), బల్లార్షా- కాజీపేట (17004) రామగిరి, భద్రాచలం రోడ్డు- బల్లార్షా(17033), సిర్‌పూర్ టౌన్- భద్రాచలం రోడ్డు (17034) సింగరేణి రైలును రద్దు చేశారు.

**దారి మళ్లించిన రైళ్లు..**

దానాపూర్- సికింద్రాబాద్ మధ్య నడిచే పాట్నా రైలును వార్ధా, అకోలా, పర్లీ రైల్వే స్టేషన్ల మీదుగా, న్యూఢిల్లీ -హైదరాబాద్ మధ్య నడిచే తెలంగాణ సూపర్ ఫాస్ట్ రైలును నిజామాబాద్ మీదుగా, నిజాముద్దీన్-హైదరాబాద్ మధ్య నడిచే దక్షిణ్ ఎక్స్‌ప్రెస్ రైలును నాగపూర్, అకోలా, పర్లీ రైల్వే స్టేషన్‌ల మీదుగా దారి మళ్లించి నడిపించారు.

**రీ షెడ్యూల్ చేసిన రైళ్లు..**

హైదరాబాద్- న్యూఢిల్లీ తెలంగాణ సూపర్ ఫాస్ట్ రైలు హైదరాబాద్‌లో ఉదయం 6 గంటలకు బయలు దేరాల్సి ఉండగా.. సాయంత్రం 6 గంటలకు, సికింద్రాబాద్- దానాపూర్ పాట్నా రైలును సాయంత్రం 5.25 గంటలకు, సికింద్రాబాద్- రక్సోల్ మధ్య నడిచే రక్సోల్ ఎక్స్‌ప్రెస్ రైలును రాత్రి 8.15 గంటలకు, సికింద్రాబాద్- హజరత్ నిజాముద్దీన్ మధ్య నడిచే స్పెషల్ రైలును రాత్రి 7 గంటలకు రీ షెడ్యూల్ చేసి రైల్వే అధికారులు నడిపించారు.

# ఇసుకాసురులు..!

- ఆ ఇద్దరు అధికారుల రూటే సపరేటు
- ఇసుక లారీల నుంచి వసూళ్ల పర్వం
- అటవీ శాఖలో ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీల అడ్డగింత

సుబేదారి, నవంబర్ 13 : జిల్లా అటవీ శాఖలో పనిచేసి బదిలీ అయిన ఇద్దరు అధికారులు తమ పాత వసూళ్ల దందాను.. ఇక్కడ ఇంకా కొనసాగిస్తున్నారు. ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని ఇసుక క్వారీల నుంచి రోజుకు వందల లారీలు వరంగల్ సిటీ ఔటర్ రింగ్ రోడ్డు మీదుగా రాకపోకలు సాగిస్తుంటాయి. ఓవర్ లోడింగ్‌తో కానీ, ఒకే డీడీతో 24 గంటల్లో రెండు ట్రిప్పులు రవాణా చేసే లారీలను పట్టుకోవడం అటవీశాఖ ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారుల డ్యూటీ. అయితే ఈ ఇద్దరు అధికారులు ఇక్కడి నుంచి బదిలీ అయిన తర్వాత కూడా ఔటర్ రింగ్‌రోడ్డులో వెళ్లే లారీలను తనిఖీ చేయకుండా అడ్డుపడుతున్నట్లు తెలుస్తున్నది. గతంలో వీరు ఇక్కడ పని చేసినప్పుడు ఓవర్ లోడ్, ఒకే డీడీపై వరంగల్ సిటీ, హైదరాబాద్‌కు రవాణా చేసే ఇసుక లారీల ఓనర్ల నుంచి పెద్ద మొత్తంలో వసూళ్లకు పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. కొద్ది నెలల క్రితం ఆ ఇద్దరు అధికారులు పక్క జిల్లాలకు బదిలీ అయినా ఇసుక లారీలను తనిఖీ చేయకుండా ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులను బెదిరించినట్లు తెలిసింది. వారి బెదిరింపులకు భయపడిన తనిఖీ అధికారి కొద్ది నెలల నుంచి లారీలను తనిఖీ చేయడమే మానేసినట్లు అటవీ శాఖలో చర్చ జరుగుతున్నది.

# రాఖీకి కన్నీటి వీడ్కోలు

- అనారోగ్యంతో పెంపుడు శునకం మృతి
- అంత్యక్రియలు నిర్వహించిన కుటుంబం



రాఖీ ఖననం



పెంపుడు కుక్క అంతిమ యాత్రలో పాల్గొన్న ప్రజలు

నర్సంపేట రూరల్, నవంబర్13 : మానవ సంబంధాలు కనుమరుగవుతున్న ఈ రోజుల్లో ఓ కుటుంబం తాము పెంచుకున్న శునకానికి అంత్యక్రియలు నిర్వహించింది. ఈ ఘటన వరంగల్ జిల్లా నర్సంపేట మండలంలోని గురిజాలలో బుధవారం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన దౌడు స్వప్న-సంపత్ దంపతులు రాఖీ అనే కుక్కను కొంతకాలంగా పెంచుకుంటున్నారు. కొద్ది రోజుల క్రితం రాఖీ అనారోగ్యానికి గురికాగా, వైద్యం చేయించినప్పటికీ బుధవారం మృతి చెందింది. వాడకట్టు ప్రజలు వెంట రాగా, మృతి చెందిన శునకాన్ని ప్రత్యేక వాహనంలో శ్మశానవాటికకు తీసుకొచ్చి పాతి పెట్టారు. తమ సొంత మనిషిలాగానే కన్నీటి వీడ్కోలు పలికారు.

















